

## ఇదంతా అభిమానుల చలవ

'ప్రతి కళాకారుడికీ సామాజిక బాధ్యత ఉంటుంది. ప్రేక్షకులు మనకు పంచిన ప్రేమకు బదులుగా మనం ఏం తిరిగిస్తున్నాం అని ఆత్మపరిశీలన చేసుకుంటే ప్రతి ఒక్క కళాకారుడూ ఒక సామాజిక సేవకుడు అవుతాడు. నాలోని సేవకుడికి ఊపిరులూదింది ఆ ఆలోచనే. అక్కడి నుంచే బ్లడ్ బ్యాంక్ పుట్టింది. ఇదంతా అభిమానుల చలవ' అన్నారు పద్మవిభూషణ్ చిరంజీవి. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సౌత్ ఇండియా ఫిల్మ్ ఫెస్టివల్‌కు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పద్మవిభూషణుడైన సందర్భాన్ని పురస్కరించుకొని ఈ వేడుకలో సినీ ప్రముఖులందరూ కలిసి చిరంజీవిని ఘనంగా సత్కరించారు. పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ, ఆహా సంస్థలు కలిసి ఈ వేడుకను నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, స్వప్నదత్, సుస్మిత కొణిదెల, ఆనంద్ దేవరకొండ, ఎస్‌కేఎన్ తదితరులు పాల్గొన్నారు. చల్లని సాయంత్రం జరిగిన ఈ సంబరంలో యువనటీనటులతోపాటు 'హనుమాన్'ఫేం తేజా సజ్జా డాన్సులతో అలరించారు.

## మలేషియాలో 90ఏళ్ల వేడుక



తెలుగు సినిమా 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'నవతిహి ఉత్సవం' పేరుతో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ (మా) మలేషియాలో ఉత్సవాన్ని నిర్వహించబోతున్నది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు మాట్లాడుతూ 'జూలైలో ఈ ఉత్సవాన్ని మలేషియాలో వైభవంగా నిర్వహించబోతున్నాం. రెండేళ్ల క్రితమే ఈ ఉత్సవాన్ని నిర్వహించాలని ప్లాన్ చేశాం. అనివార్య కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం తెలుగు సినిమా ప్రభ వెలిగిపోతున్నది. తెలుగు సినిమా ఘనకీర్తిని తెలిపేలా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తాం. ఈ వేడుక నిర్వహణకు మలేషియా ప్రభుత్వం అన్ని రకాలుగా సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ ఈవెంట్ గురించి ఛాంబర్‌తో చర్చించాం. మూడు రోజులు ఇండస్ట్రీకి సెలవు ఇవ్వాలని కోరాం. దిల్‌రాజు, దాముగారు సపోర్ట్ చేస్తామని చెప్పారు. త్వరలోనే ఈ వేడుక నిర్వహించే తేదీలను ప్రకటిస్తాం' అన్నారు. ఈ కార్యక్రమంలో మలేషియా నుంచి వచ్చిన అడ్వైజర్ ధాతుక్ కమలనాథన్, మలేషియా టూరిజం ఇండియా, శ్రీలంక ప్రతినిధి రాజౌది అబ్దుల్ రాహిమ్ పాల్గొన్నారు.



# చిక్కి చేజార్చుకుంది

మల్లెతీగలా సన్నగా ఉంటే అవకాశాలు ఎక్కువ వస్తాయని కొందరు కథానాయికల అభిప్రాయం. అందుకే బొద్దుదనంలో ఉండే ముద్దుదనం తెలీక, జిమ్ములకెళ్లి, గంటల తరబడి చమటోర్చి, ఒంపుసొంపులన్నింటినీ కరిగించేసుకుంటున్నారు. అలా తగ్గిన వయ్యారిభామల్లో కీర్తిసురేశ్ ఒకటి. బరువు తగ్గిన కీర్తిని చూసిన చాలామంది, 'మహానటి' నాటి అందం ఏది? అంటూ పెదవి విరుస్తున్నారు. ఈ బరువు తగ్గిన కారణం చేత, ఓ మంచి అవకాశాన్ని కూడా పోగొట్టుకుంది కీర్తి. భారత దిగ్గజ ఫుట్‌బాల్ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీం జీవితం ఆధారంగా అమిత్‌శర్మ తెరకెక్కించిన చిత్రం 'మైదాన్'. ఇందులో అబ్దుల్ రహీంగా అజయ్‌దేవగణ్ నటించారు. రహీం భార్య పాత్ర ఈ కథలో కీలకం. ఆ పాత్రకోసం ముందు కీర్తిసురేశ్‌ను అనుకున్నారు దర్శకుడు అమిత్‌శర్మ. కానీ ఆమె అనూహ్యంగా బరువు తగ్గడం గమనించిన అమిత్, ఆ స్థానంలో ప్రియమణిని తీసుకున్నారు. ఇటీవల ఓ ఇంటర్‌వ్యూలో ఈ విషయాన్ని ఆయన చెబుతూ –' మొదట కీర్తినే అనుకున్నాం. ఆమెకు కథ చెప్పడానికి ప్రిపేర్ అయ్యాను కూడా. కానీ ఆమె బాగా బరువు తగ్గారు. ఆ పాత్ర కాస్త బొద్దుగా ఉండాలి. అందుకే ప్రియమణిని తీసుకున్నాం' అని తెలిపారు. ఏదేమైనా బరువు తగ్గడంవల్ల కీర్తికి మంచి పాత్ర మిస్ అయ్యిందనే చెప్పాలి. ఏప్రిల్ 10న ఈ చిత్రం విడుదల కానుంది. ఇదిలావుంటే.. వరుణ్‌ధావన్ హీరోగా ఎ.కాళేశ్వరన్ తెరకెక్కిస్తున్న చిత్రం ద్వారా బాలీవుడ్‌కి పరిచయం అవుతున్నది కీర్తి సురేశ్.

## ఈసారి వినోదం.. యాక్షన్.. అన్నీ డబుల్



హీరో రామ్‌లోని ఎనర్జీని అద్భుతంగా ఆవిష్కరించిన సినిమా 'ఇస్మార్ట్‌శంకర్'. దర్శకుడు పూరీజగన్నాథ్ ఈ సినిమాతో రామ్‌లోని అప్‌డేట్ వెర్షన్‌ని ఆవిష్కరించాడు. హైవోల్టేజ్ పవర్‌ఫుల్ ఎనర్జీతో కూడిన ఈ కేరక్టరైజేషన్‌లో హీరో రామ్ చెలరేగిపోయి నటించాడు. హీరోలకు అభిమానులు ఉన్నట్టుగా ఆ కేరక్టరైజేషన్‌కి ఫ్యాన్సున్నారు. అందుకే.. ఆ పాత్రకు మరింత పవర్‌ని మిక్స్ చేసి రామ్‌తోనే 'డబుల్ ఇస్మార్ట్' చేస్తున్నారు పూరీ. ఈ సినిమా ప్రారంభమైన తొలినాళ్లలోనే విడుదల తేదీని కూడా ప్రకటించారు. ఈ ఏడాది మార్చి 8న సినిమాను విడుదల చేయనున్నట్టు పూరీ తెలిపారు. అయితే, షూటింగ్, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. తాజాగా హీరో రామ్ 'డబుల్ ఇస్మార్ట్' విశేషాలు తెలిపారు. ' 'డబుల్‌ఇస్మార్ట్'ని జూన్‌లో విడుదల చేస్తున్నాం. అప్పటికి ఎన్నికల హడావిడి కూడా అయిపోతుంది. ప్రశాంతంగా 'డబుల్‌ఇస్మార్ట్'ని ఆడియన్స్ ఎంజాయ్ చేయొచ్చు. ఈ సారి వినోదం, యాక్షన్ అన్నీ డబుల్..' అన్నారు రామ్. పూరీ ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. తెలుగుతోపాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి విడుదల కానున్న ఈ సినిమాకు నిర్మాతలు పూరీజగన్నాథ్, చార్మి కాగా, మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.

## 'ఆయ్' మ్యూజిక్ కొత్తగా ఉంటుంది

ట్రెండీ పాటలతో, విలక్షణ గాత్రంతో యువతరానికి బాగా చేరువయ్యాడు సంగీత దర్శకుడు రామ్ మిరియాల. ప్రస్తుతం ఆయన 'ఆయ్' చిత్రానికి స్వరాలను సమకూర్చుతున్నారు. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా అంజి కె మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా రామ్ మిరియాల చిత్ర విశేషాలను పంచుకున్నారు.



- నిర్మాత బన్నీ వాసు ఈ సినిమా మ్యూజిక్ కోసం నన్ను సంప్రదించినప్పుడు.. నా శైలి మ్యూజిక్ వేరు, ఇలాంటి కామెడీ ఎంటర్‌టైనర్స్‌కు నేను అంతగా సెట్ కాలేనేమో అనుకున్నా. అయితే కథ విన్నాక బాగా నచ్చింది. గోదావరి నేపథ్యంలో సాగే ఈ కథలో చక్కటి లవ్‌స్టోరీ, కడుపుబ్బా నవ్వించే హాస్యం ఉంటుంది. వేసవిలో అందరిని మెప్పించే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అవుతుంది.
- ఈ సినిమాలో రెండు పాటలు చేశాను. ఇటీవల విడుదలైన 'సూఫియానా..' అనే మెలోడీ పాటకు మంచి స్పందన లభిస్తున్నది. పెళ్లి నేపథ్యంలో వచ్చే పాటను త్వరలో రిలీజ్ చేయబోతున్నాం. ఈ రెండు పాటలు ప్రేక్షకుల్ని మెప్పిస్తాయి. చిత్ర దర్శకుడు, స్వరకర్తకు మధ్య చక్కటి అవగాహన, అభిరుచులు కుదిరినప్పుడే మంచి పాటలొస్తాయి. 'సూఫియానా..' పాట విషయంలో అదే జరిగింది. డైరెక్టర్ అందించిన సహకారంతో మంచి పాటలు అందించగలిగాను
- నేను ఇప్పటివరకు ఇలాంటి జోనర్ సినిమా చేయలేదు. అందుకే 'ఆయ్' మ్యూజిక్ డైరెక్టర్‌గా కొత్త అనుభూతినిచ్చింది. మ్యూజిక్ డైరెక్టర్ నిత్య విద్యార్థిలా ప్రతి రోజు కొత్తగా నేర్చుకుంటూ ఉండాలి. నేను కూడా కొత్త సౌండింగ్ అందించాలనే తాపత్రయంతో పనిచేస్తున్నా. ప్రస్తుతం ఈ సినిమాతో పాటు 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని చేస్తున్నా.

## అది మాత్రం కుదరదు

ఒక మహిళా అభిమాని సోషల్ మీడియాలో ఇచ్చిన రిప్లై నటి జ్యోతికను అయోమయంలో పడేసింది. వివరాల్లోకి వెళితే.. 'సైతాన్' సినిమాతో సక్సెస్ కొట్టి మంచి జోష్‌మీద ఉన్నది జ్యోతిక. ఈ సందర్భంగా తన ఇన్‌స్టా ద్వారా అభిమానులతో ఇంటరాక్ట్ అవుతూ, ఓ వైపు తన ఆనందాన్ని పంచుకుంటూ, మరోవైపు సినిమా ప్రమోషన్ కూడా కానిచ్చేస్తున్నది జ్యోతిక. ఈ సందర్భంగా చిత్రబృందాన్ని మెచ్చుకుంటూ ఓ పోస్ట్ తన ఇన్‌స్టాలో పెట్టింది. దీనిపై ఓ లేడీ నెటిజన్ స్పందిస్తూ.. 'మేడమ్.. సూర్యగారిని ఒక రోజు నాకు అప్పుగా ఇస్తారా?.. నేను పదిహేనేళ్ల నుంచి ఆయన వీరాభిమానిని మేడమ్.. ప్లీజ్..' అంటూ కామెంట్ పెట్టింది. దీనిపై జ్యోతిక స్పందిస్తూ 'అది మాత్రం కుదరదు' అంటూ ముక్తసరిగా సమాధానం ఇచ్చేసింది. ఒక్కసారి జ్యోతిక తన కామెంట్‌కి రిప్లయ్ ఇవ్వడంతో సదరు నెటిజన్‌కి ఆనందం కట్టలు తెగింది. 'ఓ మై గాడ్.. ఆయన ఎప్పటికీ మీవారే..' అంటూ సమాధానం ఇచ్చింది. అసలు ఆ నెటిజన్ ఆ విధంగా అడగటానికి కారణం లేకపోలేదు. పదిహేనేళ్ల క్రితం జ్యోతిక, సూర్య కలిసి 'నువ్వు నేను ప్రేమ' అనే సినిమాలో నటించారు. ఆ సినిమాలో కథ రీత్యా జ్యోతిక.. ఒక రోజుపాటు సూర్యని ఆయన మాజీ ప్రియురాలి వద్దకు పంపిస్తుంది. ఆ సన్నివేశం గుర్తు చేస్తూ నెటిజన్ ఆ కామెంట్ పెట్టిందన్నమాట. దానికి జ్యోతిక కూడా స్పాంటేనియస్‌గా స్పందించడంతో ప్రస్తుతం అది సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్నది.



## నాన్‌స్టాప్‌గా నవ్వించాలని డిసైడయ్యాం



'నో లాజిక్..ఓన్లీ మ్యాజిక్' అనే ట్యాగ్‌లైన్‌కు తగ్గట్లే ఈ సినిమా నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది. థియేటర్ నుంచి హాయిగా నవ్వుకుంటూ బయటకు వస్తున్నామని ప్రేక్షకులు చెబుతున్నారు' అని అన్నారు అగ్ర నిర్మాత దిల్‌రాజు. శనివారం జరిగిన 'ఓం భీమ్ బుష్' సక్సెస్‌మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో శ్రీహర్ష కొనుగంటి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శ్రీవిష్ణు మాట్లాడుతూ 'ఈ సినిమా చాలా రోజులు ఆడుతుందనే నమ్మకంతో ఉన్నాం. దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడే ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించాలని నిర్ణయించుకున్నాం. సినిమా చూసిన వారంతా ఎంజాయ్ చేస్తున్నారు' అన్నారు. ప్రేక్షకుల స్పందన చూసి సినిమా కోసం రెండేళ్లు పడ్డ కష్టాన్ని మర్చిపోయామని దర్శకుడు శ్రీహర్ష కొనుగంటి చెప్పారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

## నా కోరిక ఇలా తీరింది



'వృత్తిరీత్యా 2000 సంవత్సరం వరకూ చెన్నైలో ఉన్నాను. ఆ తర్వాత హైదరాబాద్‌కి మారాను. అనుకోకుండా ట్రైన్‌లో సుద్దాల అశోక్‌తేజ కలిశారు. ఆ జర్నీలో ఆయన రజాకారుల దుర్మార్గాల గురించి, వాళ్ల నాన్న హనుమంతు రజాకార్లపై చేసిన పోరాటం గురించీ, ఆయన రాసిన తెలంగాణ సాహిత్యం గురించి విన్నప్పుడు రోమాంచితుడయ్యాను. తెలంగాణకు వచ్చిన కొత్తలో ఇక్కడి మారుమూల ప్రాంతాలకు వెళ్లేవాడ్ని. ప్రజల అనుభవాలు వినేవాడ్ని. నిజామాబాద్ ఖిల్లాకి వెళ్లినప్పుడు దాశరధి రాసిన 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' పాట గుర్తొచ్చింది. ఆ ప్రేరణతో తీసిన సినిమానే 'రాజన్న'. అందులో రజాకార్ల దాష్టీకం గురించి లైట్‌గా టచ్ చేశాను. పూర్తిగా ఎవరైనా తీస్తే బావుండని అనుకున్నా. గూడూరు నారాయణరెడ్డిగారి ద్వారా నా కోరిక తీరింది' అన్నారు రచయిత విజయేంద్రప్రసాద్. తెలంగాణ సాయుధపోరాటం నేపథ్యంలో రూపొందిన చిత్రం 'రజాకార్'. బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్‌పాండే ప్రధానపాత్రలు పోషించిన ఈ చిత్రానికి యాట సత్యనారాయణ దర్శకుడు. గూడూరు నారాయణరెడ్డి నిర్మాత. ఇటీవల విడుదలైన ఈ సినిమా సక్సెస్‌మీట్ శనివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

## సినిమాలో హిట్ కళ కనిపిస్తున్నది

సూర్యతేజ ఏలే హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'భరతనాట్యం'. కేవీఆర్ మహేంద్ర దర్శకుడు. పాయల్ సరాఫ్ నిర్మించారు. మీనాక్షి గోస్వామి కథానాయికగా నటిస్తున్నది. ఏప్రిల్ 5న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో శనివారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో సూర్యతేజను యంగ్ ఫిల్మ్‌మేకర్ రాజు సుందరం పాత్రలో పరిచయం చేస్తూ ట్రైలర్ మొదలైంది. అనుకోని పరిస్థితుల్లో తప్పుదారి పట్టిన అతను మోస్ట్ వాంటెడ్ క్రిమినల్‌గా మారతాడు. ఈ క్రమంలో జరిగిన పరిణామాలతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. హర్షవర్ధన్ చక్కటి కామెడీ పండించాడు. ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కోన వెంకట్ మాట్లాడుతూ.. క్రైమ్ కామెడీ జోనర్‌లో వచ్చే సినిమాలకు సక్సెస్ ఎక్కువని, ట్రైలర్‌లో హిట్ కళ కనిపిస్తుందని అన్నారు. ఈ సినిమాలోని పాత్రలన్నీ చాలా కొత్తగా ఉంటాయని, క్రైమ్ ఎలిమెంట్‌తో పాటు నలభై నిమిషాల కామెడీ హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు కేవీఆర్ మహేంద్ర తెలిపారు. యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్‌ను అలరించే పూర్తిస్థాయి కమర్షియల్ చిత్రమిదని హీరో సూర్యతేజ చెప్పారు. వైవా హర్ష, హర్షవర్ధన్, అజయ్‌ఘోష్, సలీం ఫేకు, గంగవ్వ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, కథ: సూర్యతేజ ఏలే, దర్శకత్వం: కేవీఆర్ మహేంద్ర.






